AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM

30-9-2026 (Wednesday)

MAIN EDITION

అదరగొట్టిన అడ్రాయిట్ ఇండస్ట్రీస్ ఐపీవో



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశీయ స్టాక్ మార్కెట్‌లో బుధవారం ఎంట్రీ ఇచ్చిన అడ్రాయిట్ ఇండస్ట్రీస్ కంపెనీ.. ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిపించింది. తొలిరోజే 85 శాతం లాభాలు అందించింది. కంపెనీ ఒక్కో ఈక్విటీ షేరు ధరను గరిష్ట ప్రైస్ బ్యాండ్ వద్ద రూ. 134గా నిర్ణయించింది. అయితే 75.37 శాతం ప్రీమియంతో రూ. 235 బుధవారం స్టాక్ మార్కెట్‌లో లిస్టయ్యింది. అనంతరం మరో పది శాతం పెరిగి రూ. 248.39 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది.

మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డికి ఐటీ శాఖ షాక్



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: అక్రమాస్తుల కేసులో అరెస్టయిన మాజీ డీఎస్పీ భీమ్‌రెడ్డికి ఐటీ శాఖ షాక్ ఇచ్చింది. భీమ్‌రెడ్డికి చెందిన 8 మంది బినామీలపై కేసు నమోదు చేసింది. దేశంలో తొలిసారి ఐటీ బినామీ యాక్ట్ కింద కేసు పెట్టింది. ఇటీవల ఏసీబీ అధికారులు ఆయన బినామీల ఇళ్లలో సోదాలు చేసి భారీగా ఆస్తులు గుర్తించిన విషయం తెలిసిందే. దీంతో ఐటీ అధికారులు చర్యలు చేపట్టారు.

ఆండ్రాయిడ్ 17 ఓఎస్‌తో ఒప్పో ఫోన్ లాంచ్..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: చైనాకు చెందిన ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ అయిన ఒప్పో.. భారత్‌లో మరో మిడ్ రేంజ్ ఫోన్‌ను లాంచ్ చేసింది. అధునాతన ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 17 ఆపరేటింగ్ సిస్టంతో పనిచేసే ఈ ఫోన్‌లో భారీ బ్యాటరీని అమర్చారు. సేల్ అక్టోబర్ 8 న ప్రారంభం కానుంది.

మార్కెట్లో ఉల్లి మంట.. ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం



అక్షరటుడే, ఏపీ: ఉల్లిపాయల ధరలు పెరుగుతుండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కిలో ఉల్లిపాయలను రూ.35 కే సబ్సిడీపై అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతు బజార్లలో ఈ విక్రయాలు ప్రారంభమయ్యాయి. విజయవాడ రైతు బజారులో మంత్రి మనోహర్ సబ్సిడీ ఉల్లిపాయల విక్రయాలను ప్రారంభించారు.

బ్యాంకు ఎఫ్‌డీదారులకు అలర్ట్



అక్షరటుడే, బిజినెస్ డెస్క్ : బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేసే వారికి కొత్త నిబంధనలు అమల్లోకి రానున్నాయి. బ్యాంకులు ప్రతి రోజు బల్క్ ఎఫ్‌డీలపై వర్తించే వడ్డీ రేట్లను తమ అధికారిక వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా వెల్లడించాల్సి ఉంటుంది. అక్టోబర్ 1 నుంచి ఈ రూల్స్ అమలులోకి వస్తాయి.

సీఎం రేవంత్‌పై రఘునందన్ రావు ఫైర్



అక్షరటుడే, మెదక్: శ్రీరాముడు ధనికుల దేవుడంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రంగా స్పందించారు. దేవుళ్లను కూడా రాజకీయాల కోసం విభజించాలని చూస్తున్నారని ఆరోపించారు. శ్రీరాముడు రిచ్ గాడ్ అయితే భద్రాచలం రాముడి వద్దకు తన సతీమణితో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు తలంబ్రాలు తీసుకువెళ్లారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. శివుడిని కొలుస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఎప్పుడైనా శ్రీశైలం వెళ్లారా? కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్నారా? అని ప్రశ్నించారు.





భారత్ గురి అదిరింది..

ఆసియా క్రీడల్లో భారత క్రీడాకారులు అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నారు. ప్రత్యర్థులను చిత్తు చేస్తూ పతకాలను సాధిస్తున్నారు. బుధవారం ఆర్చరీ పోటీల్లో సత్తాచాటారు. గురి తప్పకుండా బాణాలు వేసి పసిడి పట్టారు. మూడు విభాగాల్లో గోల్డ్ గెలిచి హ్యాట్రిక్ సాధించారు. అంతేగాకుండా మిక్స్‌డ్ ట్రాప్ షూటింగ్ మరో పసిడిని గెలవడంతో భారత్ పాయింట్ల టేబుల్లలో టాప్–10లోకి దూసుకెళ్లింది.

- అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్

■ ఆర్చరీలో మూడు బంగారు పతకాలు
■ ట్రాప్ షూటింగ్‌లో మరో పసిడి ■ ఆసియా క్రీడల్లో సత్తా చాటిన క్రీడాకారులు

ఆసియా క్రీడల్లో 11వ రోజు భారత ఆర్చరీ క్రీడాకారులు అన్ని విభాగాల్లో రాణించారు. మహిళలు, పురుషులు టీమ్ ఈవెంట్‌లతో పాటు మిక్స్‌డ్ విభాగంలో పసిడి గెలుపొందారు. మొదట కాంపౌండ్ మహిళల ఆర్చరీ జట్టు స్వర్ణం గెలుచుకుంది. ఫైనల్‌లో భారత క్రీడాకారులు ఒక్కసారి కూడా '10' పాయింట్ల మార్కును తప్పించకుండా అద్భుతమైన ప్రదర్శన చేశారు. చికిత తనిపర్తి, ప్రితిక ప్రదీప్, జ్యోతి సురేఖ వెన్నం చైనాపై 238234 తేడాతో గెలుపొందారు. ఈ క్రమంలో ప్రపంచ రికార్డును సమం చేశారు.

మిక్స్‌డ్ కాంపౌండ్‌లో..

మిక్స్‌డ్ కాంపౌండ్ ఆర్చరీ విభాగంలో సాహిల్ జాదవ్, చికిత్సా తానిపర్తి జట్టు స్వర్ణ పతకం సాధించింది. కొరియాపై అద్భుత విజయం సాధించింది. అంతేగాకుండా లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్ క్రీడలకు ప్రతిష్టాత్మకమైన కోటా స్థానాన్ని దక్కించుకుంది. కాంపౌండ్ పురుషుల టీమ్ ఫైనల్‌లో భారత్ స్వర్ణం కైవసం చేసుకుంది. సాహిల్ జాదవ్ చివరి మూడు షాట్‌ల సెట్‌ను 10 స్కోరుతో ప్రారంభించాడు. గణేష్ మణిరత్నం కూడా 10 సాధించాడు. కుశాల్ కూడా 10 సాధించడంతో భారత్ 30/30 స్కోరు చేసింది. చైనా 30 పాయింట్లతో ప్రదర్శన చేసినప్పటికీ, అది భారత్‌ను అధిగమించడానికి సరిపోలేదు. స్కోరును పరిశీలించిన తర్వాత భారత్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుందని అధికారులు ప్రకటించారు.

షూటింగ్‌లో..

షూటింగ్ ట్రాప్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో నీరూ ధండా, కైనాన్ చెనై అద్భుత ప్రదర్శనతో పసిడి పతకం సాధించారు. మొదట్లో లక్ష్యాలను చేధించలేకపోయిన ఈ జంట.. తర్వాత పుంజుకుంది. కొట్టిన ప్రతి షాట్‌ను విజయవంతంగా ఛేదించి ఒక్క పాయింట్ తేడాతో ఖతార్‌ను ఓడించింది. నీరూ ధండా మంగళవారం వ్యక్తిగత విభాగంలో గోల్డ్ మెడల్, మహిళల టీమ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించింది. తాజాగా మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో గోల్డ్ మెడల్‌తో ఆకట్టుకుంది.

ఒకే సామాజిక వర్గానికి 2 టికెట్లా : కవిత



అక్షరటుడే, హైదరాబాద్ : కాంగ్రెస్ ఎమ్మెల్సీ టికెట్ల కేటాయింపుపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రంగా స్పందించారు. రెండు టికెట్లను రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాలు.. రెండు చోట్లా రెడ్డి నాయకులకే టికెట్.. ఇది ముమ్మాటికీ సామాజిక అన్యాయం కాదా?" అంటూ నిలదీశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన బాధ్యత అధికార పార్టీపై ఉంటుందని కవిత గుర్తుచేశారు. అలా కాకుండా కేవలం ఒకే వర్గానికి పెద్దపీట వేయడం తెలంగాణ ఆత్మగౌరవానికి విరుద్ధమని ఆమె ఘాటుగా విమర్శించారు.



పెయిన్ కిల్లర్స్, యాంటీబయాటిక్స్ వాడుతున్నారా?

అక్షరటుడే, ఫీచర్‌డెస్క్: తలనొప్పి, ఒళ్లు నొప్పులు రాగానే వెంటనే పెయిన్ కిల్లర్ వేసుకోవడం.. జలుబు, గొంతునొప్పి రాగానే సొంతంగా యాంటీబయాటిక్స్ వాడేయడం చాలామందిలో కనిపిస్తుంటుంది. అయితే ఎలాంటి వైద్య సలహా లేకుండా ఇలాంటి మందులను పదేపదే వాడటం భవిష్యత్తులో తీవ్ర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని దేశ అత్యున్నత ఔషధ నియంత్రణ సంస్థ సీడీఏస్‌సీఓ తీవ్రంగా హెచ్చరించింది. పెయిన్ కిల్లర్లను విచ్చలవిడిగా వాడటం వల్ల కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని, అలాగే అవసరం లేకుండా యాంటీబయాటిక్స్ తీసుకోవడం వల్ల 'యాంటీ మైక్రోబయల్ రెసిస్టెన్స్' పెరిగే అవకాశం ఉందని స్పష్టం చేసింది.

పిల్లల పాలపొడిని వదలని అక్రమార్కులు!

అక్షరటుడే, హైదరాబాద్ : కర్ణాటకలో పిల్లల కోసం ఉచితంగా నందిని పాలపొడి అందిస్తున్నారు. క్షీర భాగ్య పథకం కింద ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు పౌష్టికాహారం అందించడానికి పాలపొడి పంపిణీ చేస్తున్నారు. అయితే దీనిని కొందరు బహిరంగ మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. తాజాగా 210 కిలోల నందిని పాలపొడిని తెలంగాణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీనిని కర్ణాటక నుండి హైదరాబాద్ మీదుగా ఆలేర్, జనగామకు రవాణా చేస్తుండగా ఒక ప్రైవేట్ రవాణా కార్యాలయంలో స్వాధీనం చేసుకున్నారు.





రూ.3 వేల కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

అక్షరటుడే, నేషనల్ డెస్క్ : గుజరాత్ ఏటీఎస్‌తో కలిసి భారత కోస్ట్ గార్డ్ నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా డ్రగ్స్ దొరికాయి. అరేబియా సముద్రంలో ఒక ఇరాన్ పడవ నుంచి రూ. 3 వేల కోట్లకు పైగా విలువైన 526 కిలోల మెథాంఫేటమిన్, హెరాయిన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు బుధవారం వెల్లడించారు. లక్షద్వీప్ సమీపంలో సెప్టెంబర్ 25న కోస్ట్ గార్డ్ సిబ్బంది ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. ఓ పడవను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. అందులో ఐదుగురు పాకిస్తానీ జాతీయులను ఉన్నారు. లోపల తనిఖీ చేయగా భారీగా డ్రగ్స్ లభ్యం అయ్యాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో తప్పిన ప్రమాదం

అక్షరటుడే, రంగారెడ్డి : శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ ఎయిర్‌పోర్టులో ప్రమాదం తప్పింది. శంషాబాద్ నుంచి 591 ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం విజయవాడ వెళ్లేందుకు బయలు దేరింది. టేకాఫ్ అయిన కొద్దిసేపటికే విమానంలో సాంకేతిక లోపం ఉన్నట్లు పైలెట్ గుర్తించారు. వెంటనే ఏటీసీకి సమాచారం అందించాడు. అనంతరం విమానాన్ని తిరిగి శంషాబాద్‌లో అత్యవసరంగా ల్యాండింగ్ చేశారు. విమానం సురక్షితంగా ల్యాండ్ కావడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.



కరెంట్ కోతలతో ఎండుతున్న పంటలు

అక్షరటుడే, నల్గొండ : రాష్ట్రంలో వ్యవసాయానికి సరిపడ కరెంట్ ఇవ్వడం లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంట్ కోతలతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లాలోని చిన్న మందారం గ్రామంలో పంట పొలాలను బీజేపీ నాయకులు పరిశీలించారు. రాంచందర్‌రావు మాట్లాడుతూ.. జిల్లాలో కరవు పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఈ దుస్థితికి కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. రైతులకు అవసరమైన విద్యుత్, సాగునీటిని సమృద్ధిగా అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవడంతో వరి పంటలు ఎండిపోయాయన్నారు.



వియత్నాంలో ఇద్దరు భారతీయుల మృతి

అక్షరటుడే, నేషనల్ డెస్క్: వియత్నాంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు భారతీయులు మృతి చెందారు. రాంచీకి చెందిన రాజా కుమార్ వర్మ రెండేళ్లుగా వియత్నాంలో నివసిస్తూ యోగా నేర్పిస్తున్నారు. జంషెడ్‌పూర్‌కు చెందిన వినయ్ యాదవ్ కూడా సుమారు రెండేళ్ల క్రితం ఉపాధి కోసం వియత్నాం వెళ్లారు. యోగా శిక్షకుడిగా పని చేస్తున్నాడు. ఈ నెల 25న యోగా తరగతులు ముగించుకుని వస్తుండగా, వారి బైక్ అదుపు తప్పి ఎదురుగా వస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వర్మ అక్కడికక్కడే మరణించగా, యాదవ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల తర్వాత చనిపోయాడు.

